# నిలువుటద్దం

జి. పార్వతి

పెద్ద కథ

(గత సంచిక తరువాయి)

కేశవుడు సెలవలకి వచ్చాడు.

పొద్దుటే పిల్లలు ముగ్గుర్నీ తీసుకుని డాబామీది మొక్కల కుండీలను చూస్తూ ఎదురింట్లోకి చూశాడు. ఒక అమ్మాయి కిటికీలోంచి చూసి వెంటనే పక్కకి వెళ్ళిపోయింది. బాబు ఇది గమనించి చెప్పటం మొదలెట్టాడు.

"బాబాయ్!...చూడు కొత్తింట్లో తాతగారు నాకూ, గిరిజకు రోజూ సాయంత్రం బిళ్ళలు పెడతారు. నిన్న సాయంత్రం మటుకు పెట్టలేదు. ఆయన వూళ్ళో లేరుగా!" కేశవుడు ఈ మాట విని ఆశ్చర్యపోయాడు. ఈ విషయం చిన్న వదిన గారిని అడిగేసరికి ఆవిడ ఆశ్చర్యంగా అంది, "ముందు ఈ కాఫీ తాగు చల్లారకుండగా... అయితే నీకు ఎదురింట్లో గౌరీపతిగారు వచ్చినట్టు తెలీదనమాట. వాళ్ళు చాలా మర్యాదస్తులు. ఆయనకి ఒక్క అమ్మాయి, అబ్బాయీను. ఆ అమ్మాయి పేరు ప్రమీల. ఇంటర్ చదువుతోందిట." ఇదంతా వినగానే వాళ్ళను చూసి రావాలనిపించింది కేశవుడికి.

ముసలావిడకి కేశవుడి వడుగుచేయాలని ఒకటే తొందరగా వుంది. కేశవుడు యీమాటు వచ్చిందగ్గర్నుంచి కొంచెం మారినట్టున్నాడు. అట్టే ఏ విషయాలు పట్టించుకోవడం లేదు.

"ఎందుకమ్మా నాకు వడుగు!...ఎప్పుడో ఒకప్పుడు చేసుకోవచ్చు. డబ్బు ఎక్కువగావుంటే యిలాటి కనులెందుకు?...యింక పెళ్ళిమాటకూడా చెప్తున్నాను. నీ సరదా, ముచ్చట తీరేందుకు ముగ్గురు కోడళ్లు వచ్చారు. నా సంగతి ఎప్పుడో చూడొచ్చు..." ఈమాట పెద్దాయన విని చికాకుగా అన్నారు "పోనీ వడుగు చేసుకోవటాని కేమిరా?...అమ్మకి ఒంట్లో కులాసాగాలేదు నువ్వు ఆవిడ మాట వినకపోతే మంచిది కాదు..."

కేశవుడుకి పెద్దన్నగారి మాటకు కొంత కోపం వచ్చినా ఒప్పుకుని తీరాల్సి వచ్చింది. ఇల్లంతా హడావడిగావుంది పెద్దావిడ తల్లి వాళ్ళు వచ్చారు. సీత, సీను యింక రెండురోజులు వుందనగా కాబోలు వచ్చారు. చిన్నావిడ చాలా హడావడిగా వుంది. ఆవిడ తాలూకువాళ్ళు తండ్రీ, సవతి చెల్లెలు మటుకు వచ్చారు. ఎదురింట్లో పైవాళ్ళ వాళ్ళకి విడిదికింద యిచ్చారు. మూడు రోజులు చాలా డబ్బు ఖర్చుచేసి హడావడిగా చేశారు. వెళ్ళేటప్పుడు అందరికీ ఏమివ్వాలో తెలీలేదు ముసలావిడకి. శశి ఇదంతా ఎప్పుడు గ్రహించిందో తెలీదు రెండు వాయిల్ తానులు తెప్పించి అత్తగారిదగ్గరవెళ్ళి అంది, "అత్తగారూ!... మీరు వీళ్ళందరికీ ఏ చీరలో పెట్టాలని చూస్తున్నారేమో. మీరు వూరుకోండి, ఈ రవికలగుడ్డ కొబ్బరి కాయలు చాలు...యింకా కేశవుడి పెళ్ళి ఒకటి బాకీయే వుందాయె ..." అంది. ఈ మాటకు అత్తగారు, పెద్దకోడలు ఆశ్చర్యపోయారు.

ఆనక పెద్దాయనతో అంది "చూడు అబ్బాయ్ శశి తెలివితేటలు మా ఎవరికీ లేవు...ఇవాళ అది ఆలోచన చెప్పకపోతే ఏ నాల్గువందలో ఖర్చయేవి. నేను అనుకుంటూంటాను. నువ్వు ఎంచి ఏవేళైతే తెచ్చావో అది వచ్చింతరువాత నాకే విచారమూ లేకుండా పోయింది..."

చుట్టాలంతా వెళ్ళటమయింది. శశి తండ్రి మటుకు మధ్యాహ్నం కూతురుదగ్గరకెళ్ళి అన్నాడు

"శశీ...మన బుల్లెమ్మని కేశవుడికి చేసుకుంటే బాగుంటుందనుకుంటాను. నువ్వింకా ప్యాసయితే యిది ధర్డుఫారం ప్యాసయింది..."

"ఏమోనాన్నా!... నే నిటువంటివి చెప్పలేను. మా అత్తగారి వుద్దేశ్యం ఎలావున్నా కేశవుడు యిప్పుడు పెళ్ళిచేసుకునేందుకు ఒప్పుకోడు..."

"పోనీ ఎప్పుడయితే అప్పుడేను. యివాళ చేసుకోమనను...స్థిరపర్చుకుందామని..."

"మా అత్తగారి నడిగిచూడు. కాని అడగటం వల్ల లాభముండదనుకుంటాను." అని అంది. మెల్లగా తండ్రి కూతురు మాట వినకుండానే ముసలావిడ దగ్గర కెళ్ళాడు.

"చూడండి అక్కయ్యగారూ! మా బుల్లెమ్మకి పెళ్ళి చేయాలనుంది. పిల్లని పిల్లాడు కూడా చూసేవుంటాడు... కేశవుడికి చేసుకుంటే చాలా సంతోషిస్తాను..."

"అదేమిటండీ...మీరు ఒక పిల్లని మా యింటి కిచ్చారు. మారు తల్లి పిల్లలయినా మళ్ళా ఎలాగ చేసుకోవటం?...పైగా వాడు వడుగేవద్దని గొడవ పెట్టాడు. పెళ్ళిమాట వింటే యింట్లోంచి పారి పోతాడేమో!..." యీ మాట అంటూండగానే పెద్దాయన కోపంగా వచ్చారు.

"ఏమిటండీ మామయ్యగారూ!...మీరు మళ్ళా మమ్మల్ని ఏమనేందుకొచ్చారు. మీ యింటినుంచి రత్నంలాటి పిల్ల రానే వచ్చింది. పైగా మీరు ఒక పెళ్ళి చేయడంతోనే మాతో తగవులాడారు... పిల్లని చూసి మేము ఒప్పుకున్నాంగాని...మీ అంతవాళ్ళు దొరక్కగాదు..."

"ఏమిటోయి వెంకట్రావు నువ్వనేది?...పిల్లని యిస్తానని వచ్చినవాడికి యిదా మర్యాద?..." కోపంగా.

"యింక మీతో వాదించే అవుసరం నాకు లేదు...మీరు వెంటనే వెళ్ళిపోవచ్చు. నాటకం ఆడుదామని చూస్తున్నారా మామగారు!" అని కోపంగా వెళ్ళిపోయారు. కండువా భుజంమీద వేసుకుంటూ మారు చెప్పకుండా వెళ్ళిపోయారు. యిదంతా చూస్తున్నా చిన్నాయనగాని, శశిగాని ఏమీ తెలీనట్టే వూరుకున్నారు.

"ఎందుకురా అన్నయ్య ఆయన తోటిఘర్షణ? కేశవుడి కిష్టంలేదంటే పోయేదిగా ఆయన అనవస రంగా నామీద కేకలేశాడు..."

"ఆఁ, అంతేరా ఆయన వరస...పెళ్ళినాటి నుంచీ ఈనాటి వరకు మనకి ఆయనకి సంబంధం లేకపోయింది. పిల్ల నివ్వటానికైతే సిద్ధపడ్డాడు. శశి అక్కడ ఎలా పడిందో అనే ఆశ్చర్య పడ్తూం టాను!..."

"అల్లుడు బాగానే వూరుకున్నాడు కాని, మీకెందుకంత కోపం ఆయనమీద?..." అంది నవ్వుతూ పెద్దావిడ.

"వాడు నోరువాయి లేనివాడని లోకువకడితే మేమంతా ఏమయ్యాం..." అన్నారు. ఈమాట కైతే తోడికోడళ్ళిద్దరూ నవ్వుకున్నారు.

• • •

ఈమధ్య కేశవుడికి గౌరీపతిగారింట్లో చాలా కాలక్షేపంగా వుంటోంది. వారి లక్ష్మణరావుతో రోజూ షికారు పోతూండటం యిద్దరూ కలిసి గదిలో కూర్చుని యింగ్లీషు నవలలు అవి చదువు కుంటున్నారు.

సాయంత్రం లక్ష్మణరావు తల్లిని చుట్టాలింటికి తీసికెళ్ళాడు. ప్రమీల ఏదో అల్లుకుంటూ కూర్చుంది. "యింట్లో ఎవరూలేరు...అన్నయ్య ఒకగంటలో వచ్చేస్తాడు. పోనీ కాస్సేపు కూర్చుని వెళ్ళండి..." అని అన్నా వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు. ప్రమీల కేశవుడ్ని గురించి ఏమీ అంతుకట్టలేకుండా వుంది. ఎప్పుడలా తను మాట్లా డదామన్నా తప్పించుకుని పోతూంటాడు. పెద్దా విడ నోటిమీదుగా ఒకటిరెండుసార్లు వింటికూడా, కేశవుడు చిన్నప్పట్నుంచి వెంకివాడని...

సీనువాళ్ళు వెళ్ళిపోయారుగాని, కేశవుడి సెలవ యింకా వుండటంతో ఆగిపోయాడు. ముసలావిడ రెండురోజుల్నుంచి బొత్తిగా లేవటంలేదు. నూట మూడు, నాల్గు జ్వరం వుంటోంది. నిన్న సాయంత్రం అన్నదమ్ము లిద్దరూ తల్లి బాగానే వుందని కారు తేవటానికి మెడ్రాస్ వెళ్ళారు. కేశవుడు ఒక్కడే యింట్లోవున్నాడు. తోడికోడ ళ్ళిద్దరూ పిల్లలకి భోజనాలు పెడ్తున్నారు. ప్రమీల తల్లితో వారింటికి వెళ్ళింది.

"అలా కూర్చోండి సావిత్రమ్మగారూ...అత్త గారికి బొత్తిగా బాగులేదు. లేచికూర్చో లేకుండా

వున్నారు. వారిద్దరూ చెన్నపట్టణం వెళ్ళారు... యింట్లో వంటావిడ లేదు..." అంది శశి.

"వస్తే అన్నిచిక్కులూ ఒకసారివస్తాయమ్మా.. వెళ్ళి ఒదినగార్ని చూసివస్తాను..." అని వెళ్ళారు. ప్రమీల కేశవుడిపక్క కుర్చీలో కూర్చుంది. ముసలావిడ మూసినకన్ను తెరవటంలేదు. కేశవుడు మెల్లగా గ్లూకోజునీళ్ళు నోట్లోపోశాడు. ప్రమీల లేచి తలగడామీద ఒలికిన నీళ్లు తనచేత్తో తుడిచి పక్కగా కూర్చుని తల పడ్తోంది. కేశవుడు మెల్లగా అన్నాడు.

"మీరు లేవండి...అమ్మ తల నేనుపడతాను."

"ఇదేమంత కష్టం కాదులెండి" అంది ప్రమీల. కేశవుడు ముసలావిడ తలమీద గుడ్డ వెయ్యబోయాడు. ప్రమీల తల ఢీకొంది. "క్షమించండి" అన్నాడు తలదించుకుని. ప్రమీల సిగ్గుతో కుంగిపోయింది.

వెళ్ళిపోతూ సావిత్రమ్మగారు కేశవుడితో అన్నారు, "మామయ్యగారిని రాత్రి యిక్కడే పడుకోమని చెప్తాను ... నేను వెళ్ళి ఆయన్ని పంపుతాను. డాక్టరు చూశాడుకనుక అట్టే భయపడాల్సింది లేదులే" అంది. కేశవుడు మెట్లదాకా ఒదిలి గట్టిగా అన్నాడు, "మీ నాన్నగారిని అనవసరంగా శ్రమపడొద్దని చెప్పండి... ఏమంత భయపడవలసింది లేదు..."

"అదేదో మీరేవచ్చి చెప్తే ఆయనకి ఎక్కువ నమ్మకంగా వుంటుంది... నామాటతో విని ఆగిపోరనుకుంటాను..." ఈమాట చాలా చిరాకుగా మాత్రం అంది.

యింటికెళ్ళి భోజనం చేయకుండానే డాబా ఎక్కి కూర్చుంది. తెలీకుండా కంటివెంట నీరు తిరిగింది. అన్నగారు చూసి ఎందుకనడిగాడు. "అన్నయ్యా! కేశవుడుగారు ఎందు కలాగున మాట్లాడుతారు! ఆయన కళ్ళముందు మనం ఏదో తక్కువవాళ్ళ మనుకుంటాను."

"లేదమ్మా...అతను పద్ధతే అంతటిది..." అని నవ్వాడు.

ముసలావిడ నాల్గు రోజుల్లో తేరుకుంది. దగ్గు ఆయాసం మటుకు తగ్గలేదు. అన్నదమ్ములిద్దరూ కారుతో దిగారు. తల్లిని చూసి చాలా ఆశ్చర్యపోయారు. కేశవుడు సెలవులయాయని వెళ్ళిపోయాడు.

"నేనింక బతకనురా అబ్బాయ్... కేశవుడి చదువు రెండు సంవత్సరాలతో అవుతుంది. వాడి విషయం మటుకు బెంగగావుంది. సీను దూరమయ్యాడు. వీడు ఏదేశంలో వుంటాడో తెలీదు. ఒకప్పుడు నా పిల్లల్ని, వాళ్ళ తెలివిని చూసి గర్వపడ్డాను...కానీ నేను నిలుపుకోలేకపోయాను." అంది ఆయాసపడ్తూ.

"నువ్వు అలాగ మాట్లాడకమ్మా...మమ్మల్ని యింత వాళ్ళని చేశావు నువ్వు లేనిదే ఒక క్షణం బతకలేము." అన్నారు రుదకంఠంతో. తల్లికొడుకు లిద్దరి మధ్యగా కూర్చుని యిద్దరి మొహాలలోనికి నిదానంగా చూసింది.

• • •

కూతురు రాలేదని తులసమ్మగారు వచ్చింది. పెద్దావిడకి తల్లి వచ్చినందుకు తృప్తిపడ్డా భయం మటుకు వేసింది. రాగానే చేతులు వెనక్కి కట్టుకుని యిల్లంతా చూసింది.

"యీ యిల్లు కాక మరొకటి వుందికదూ! నల్గురికీ నాల్గు భాగాలు బాగానేవుంది... మీ గది శశి గది కన్నా చిన్నదనుకుంటాను... వాళ్ళది వీధివేపు మీదివంటింటి వేపు వుండటం బాగులేదు."

"ఎలాగో ఒకలాగున వుందమ్మా ... ఎవరి గదుల్లోనూ ఎవరం దూరి కూర్చోము శశి నేను ఒకేచోట వుంటాం...దాని గదిలోనో నా గదిలోనో" అంది విసుగ్గా.

మధ్యాహ్నం పెద్దాయన ఎవరో స్నేహితులిద్దర్ని భోజనానికి పిల్చారని చెప్పారు. భార్య నవ్వుతూ అంది.

"మీకు శశి వంట బాగా నచ్చుతుంది... అందుచేత యివాళ దానిచేత వండించండి."

"అదేమిటక్కయ్యా. నా వంట ఆయన కెలా తెలిసింది!"

"నువ్వు పెళ్ళిచూపులు కొచ్చినప్పుడే మీ బావగారికి వంటరుచి చూపించావట...యింటి కొచ్చి ఒకటే పొగిడారు."

"ఏదో నామీద అభిమానంకొద్దీ అన్నారేమో అంత బాగా నే నెక్కడచేయగలను అక్కయ్యా"

"లేదే, నిజంగా ఆయన అలాగే అన్నారు."

"అవును శశీ! యివాళ నీ చేతి వంట తినాలని వుంది. మీ అక్కయ్యని మటుకు రానీయకు. వుప్పో, కారమో మర్చిపోతూంటుంది" అని నవ్వారు.

తోడి కోడళ్ళిద్దరూ వంటంతా గంటలో చేసి పెట్టారు. తులసమ్మగారు వసారాలో కూర్చుని భవిష్యత్తుగూర్చి ఆలోచిస్తోంది. రాత్రి శశితో పెద్దావిడ పడ్డన సాయపడి యిద్దరూ కలిసి కూర్చున్నారు భోజనానికి.

"నువ్వు పుట్టింటికి వెళ్ళావా ఏటే అమ్మాయి"

"లేదండి పిన్నిగారు ... అమ్మ లేదు. పైగా మేము వెళ్ళితే అత్తగారు దేవులాడతారు."

"ఆడదానికి పుట్టిల్లంటూ వుంటే కష్టానికీ సుఖానికీ ఆవుతుంది." అని అనేసరికి పెద్దావిడకి కోపం వచ్చింది.

సాయంత్రం అందరూ కారులో ఎక్కి షికారుగా వెళ్ళొచ్చారు. ప్రమీలకూడా వెళ్ళింది. శశి ప్రమీలతో చెప్పనిదే ఏపనీ చెయ్యదు. యిప్పుడు కూడా కబురంపి తీసికెళ్ళింది. వచ్చిం తరువాత మళ్ళా ముసలావిడ మూల్గువిని చకితులయ్యారు.

యివాళ రాత్రి ముసలావిడమీద ఏమీ ఆశ పెట్టుకోవాల్సిన మాటకాదు. పెద్దాయన రాత్రి పదిగంటలకి డాక్టరుదగ్గర కెళ్ళారు. అప్పటికి ఆయనకి మతిచెడినట్టయింది. తండ్రి పోయిన దగ్గర్నుంచి తల్లిదగ్గర చాలా అలవాటయింది. యివాళ ఆ మాతృదేవి తామందర్నీ విగతుల్ని చేస్తుందేమోనని తెలుసుకున్న కొద్దీ ఆందోళన పడ్తున్నారు.

"ఏమిటండీ వెంకట్రావుగారూ!...మానోటంట యిలాటి మాటలు నేను విని ఎరుగను. ఆవిడకి వయసు మించింది."

"మీ పాదాలు పట్టుకుంటాను. నేను తల్లి వారి అమ్మ లేదనుకొని యీ యింట్లో వుండలేను. అటువంటి స్థితి రానీకుండా కాపాడాలి డాక్టరుగారూ .."

"నేను ప్రయత్నంలో లోపం రానియ్యను... చూడండి జరామరణాలు ఎటువంటివో అవి ఎలా సంభవిస్తాయో శాస్త్రకారులు కనిపెట్టలేరు...భగవంతుడు వాటినికూడా అరికట్టే శాస్త్రం తెలియజేస్తే చాలా బాగుండునన్పిస్తుంది."

కారు యిల్లు చేరింది. ముసలావిడ అంత్యశ్వాశ పెద్దకొడుకు రాగానే విడిచింది. ఆవిడ నవ్వుతూండగానే భగవంతుడ్ని చేరింది. నిజానికి ఆవిడ ఏపని చేయాలనుకున్నదో అన్నీ సఫలీకృత మయాయిగా!...మరి భూమాత యింకెందుకు ఆట్టే పెట్టుకుంటుంది!...

* * *

కేశవుడు, సీత అంతా వచ్చారు. కేశవుడు నాల్గురోజుల్నుంచి అన్నాహారాలు మానివేశాడు. ముఖ్యంగా శశికివ్రన్న ఓర్పు పెద్దావిడకి లేదు. ముసలావిడ పోయింతరువాత ఆవిడకూడా ఏదో విధమైన తలనొప్పిగానే వుంది.

తులసమ్మగారు అదను చూసుకుని కూతురితో నేరాలు మొదలెట్టింది. శశి కేశవుడి దగ్గరకెళ్ళి ఏమన్నా రాస్తుంటూ అంది.

"చూడు కేశవా!...నీ చిన్నదనంటే నీకు గౌరవం వున్నట్టయితే ఇవాళ అన్నానకి వచ్చి తీరాలి. ఎన్నాళ్ళు యిలాగ వుంటావు...యీ మార్పు నీ ఒక్కడికేకాదు, యింటిల్లపాదికీ బాధగావుంది..." పెద్దాయన కొంచెం కోపంగానే వచ్చి కేకలేశారు. కేశవుడు పక్కమీద పడుక్కుని రోదించాడు.

శశి పళ్ళెంతో అన్నం తెచ్చి గదిలో పెట్టిరమ్మని పిల్చింది. కేశవుడు నెమ్మదిగా లేచి కూర్చుని నాల్గుమెతుకులు కొరికాడు. సాయంత్రం ప్రమీల వచ్చేసరికి శశి ఏడుస్తూ చెప్పింది "ప్రమీల!... మా కేశవుడు బొత్తిగా పాడయిపోయాడు. మీరంటే కొంచెం స్నేహం వుంది, నువ్వెళ్ళి చెప్పమ్మా..."

ప్రమీల కేశవుడి గదిలో కెళ్ళింది. కేశవుడు బల్లమీద తలపెట్టుకుని కూర్చున్నాడు. "మీరు బొత్తిగా పాడయిపోతున్నారని మీ వదిన ఏక బాధపడ్తున్నారు. .మీరీవిధంగా బెంగపెట్టుకుంటే మిమ్మల్ని ఎవరు చూడగలరు చెప్పండి!...మీరు భోజనం చేస్తేనేగాని నేను భోజనం చేయను యీపైన..."

"నేను యీ బాధను ఎలా మర్చిపోను ప్రమీల ఏ వస్తువైనా పోగొట్టుకున్న బాధలేదుగానీ...యీ విలువైన వస్తువ... వేయి జన్మలకి లభించదు... ఎటుచూసినా అమ్మ మాటలు విన్పిస్తాయి..."

"అయితేనేసీ మీరే చెప్పండి, యిలా బాధ పడటంవల్ల మీరెంత నీరసపడిపోయారో తెలుసా! మీ అమ్మగారేవున్నట్టయితే మిమ్మల్ని యిలా చూడగల్గేవారు కారు..."

"నేను ఎలావున్నా చిన్న ఒదిన తప్పించి బాధ పడేవాళ్ళెవరుంటారు ఏరీ ప్రమీలా!... యింక రెండు రోజుల్లో సెలవు ఆఖరు...మళ్ళా కాలేజీ...యింక యింటికి ఎవర్ని చూడాలని రానుచెప్పు..."

ప్రమీలకంట నీరు కారటం కేశవుడు చూసి విస్తుపోయాడు. "ఏమిటి ప్రమీలా!...నువ్వు ఏడవడం దేనికి?..."

"నాది మీలాగున రాతిగుండెమటుకు కాదు.. మీకన్నా నాకు బాధగావుంది...మీరు భోజనం అదిసమంగా చేస్తారుకదూ. ఒట్టువేయండి." అంది రెండు చేతులూ పట్టుకుని. కేశవుడు క్షణకాలం నిస్పృహ చెందాడు. అతనిలో ప్రమీల చేయి తగల గానే ఏదో నవ్యానుభూతిపొడసూపింది.

"నాకోసం బాధపడే ప్రాణి వుందని యీ నాటిదాకా గ్రహించుకోలేకపోయాను ప్రమీలా."

"అయితే మాయింటికి యీ రెండు రోజులు వస్తూపోతూవుండండి...నేను మీ బాధ పోయే ట్టుచేసే పూచి నాది." అంది నవ్వుతూ. కేశవుడు ప్రమీలకేసి వింతగా చూడసాగాడు.

• • •

చిన్నాయన గుండెజబ్బు మరీ ముదిరింది. డాక్టరు రెండునెలలు ఇంట్లోవుండి విశ్రాంతి తీసుకోమన్నాడు. తులసమ్మగారు, కూతురి గుస గుసలు మరీ ఎక్కువయాయి.

"అమ్మాయీ...కష్టించి సంపాదించేది నీ భర్త. నువ్వు అనుభవించేది ఏమంత లేదుగాని, వాళ్ళంతా చాలా ముచ్చటగా వున్నారీయింట్లో..." శశి యీ మాట వినకపోలేదు. కాని తోడికోడలు సమాధానం లేకపోయేసరికి నిర్విణ్ణురాలయింది.

"ఏమ్మా!...నీ భర్తకి పళ్ళరసాలు యిమ్మని చెప్పారా ఏం?...మనిషికి సరైన పని చేతిలో వుంటే ఆరోగ్యం లేకేమౌతుంది...యింట్లో వుంటే అన్ని రోగాలే" శశి తలూంచుకుని వెళ్ళిపోయింది.

ఇవాళ పెద్దావిడ తలుపు తెరుచుకుని ఇవతలకి తొంగి చూడలేదు. ఇదంతా పెద్దాయన ఏవగించుకుంటూనే వున్నారు. సాయంత్రం తల్లితో కారులో వెళ్ళి బాబు పుట్టినరోజుకి బట్టలు తెచ్చాడు. ఈ కొత్త ఆచారం చూసి చిన్నావిడ విస్తుపోయింది. ఇంట్లో ఏ ఒకరి పుట్టినరోజు వచ్చినా తక్కిన పిల్లలకి తేవలసిందే. రాత్రి చిట్టి ఏడుస్తూ కూర్చుంది. పెద్దాయన యిదంతా చూసి చిట్టిని అడిగారు "పెద్దనాన్నా! నాకు తేలేదు దొడ్డమ్మ. నా పుట్టినరోజుకైతే వాడికి కూడా తెచ్చారు."

"ఏం శశీ! మీ తోటికోడలితో ఈ విషయం ఎందుకు ప్రస్తావించలేదు?"

"నేనే ఒద్దని చెప్పాను చిట్టికి. మొన్ననే తెచ్చాంగా."

"లేదు పెద్దనాన్నా అమ్మ అబద్ధం చెప్తోంది. దొడ్డమ్మ అమ్మమీద కోపంగా వుంది." యీ మాట విని పెద్దాయన మౌనంగానే వెళ్ళిపోయారు.

పొద్దుట ప్రయివేటు మేష్టరు దగ్గర మరొక రసాభాసు అయింది. బాబు పెన్సిలు పారేసి రెండురోజుల్నించి కొత్తది తెస్తున్నాడు. మళ్ళా యివాళ వుత్తచేత్తో వెళ్ళేసరికి పెద్దాయన కోపంగా అడిగారు. "ఏరా! నీకు రోజుకొకటి కావాలా! పుస్తకాలు పెన్సిలు జాగ్రత్తగా పెట్టుకోలేవూ?"

"చిట్టి తీసుకుంది నాన్నా"

"లేదు పెద్దనాన్నా...యిదిగో నా పెన్సిలు నాకేవుంది. కావలిస్తే అమ్మనడుగు" అంది టెక్కు మొహంవేసి, యిదంతా పెద్దావిడ తెర తప్పించి శ్రద్ధగా వింటూనే వుంది. పెద్దాయన బాబుని రెండు చెంపలు గట్టిగా వాయించారు. బాబు తల్లిని పట్టుకుని ఏడుపు ప్రారంభించాడు.

"మీకు పిల్లలన్నా, నేనన్నా విషప్రాయ మయింది..." అని చరచరా నడిచి వెళ్ళిపోయింది.

చిన్నావిడ యివాళ గదివిడిచి వచ్చేస్థితిలో లేదు. చంటాడు ఇంకోవిధంగా మూల్గుతున్నాడు. పెద్దావిడ పన్నెండు గంటలవేళ గబగబావచ్చి తొంగిచూసి అంది "ఏమే శశీ!...వంట చేయ టమే కాకుండా మీ భోజనాలు దగ్గర్నుంచి గదిలోకే తెమ్మన్నారా ఏం!"

"నీకు కష్టం కల్గించాలని నా అభిమతంకాదు అక్కయ్యా...నేనూ, ఆయన భోజనం చేయము. పిల్లాడికి చాలా జ్వరంగావుంది..."

"యింకా యిలాటి వాదులుకూడా వేసి యింట్లోంచి గెంటించాలని చూస్తున్నావాళకి మీరు

భోజనం ఎందుకు మానేస్తున్నారు?' అంది చిరాగ్గా. చిన్నావిడ మౌనంగా వుండిపోయింది. తోడికోడలిలో యీ మార్పు ఎందుకు కలిగిందో తల్చుకునేసరికి గుండె పగిలిపోతోంది. తన తల్లి, తోడు ఆవిడే అనుకుని సంతోషించేది. కాని యీ భేదం ఎందుకు కల్గిందో అని వూహించుకున్న కొద్దీ బాధతో కుంగిపోతోంది.

కేశవుడికి చదువుకూడా పూర్తయినట్టుంది. అతను ఇంట్లోనే వున్నాడు. చిన్న ఒదినగారి దుస్థితి చూసి విస్తుపోయాడు. యివాళ తులసమ్మగారు ప్రత్యేకం శశికి కబురంపింది వంటావిడ రాలేదని. రాత్రి పెద్దాయన చిన్నాయన గదిలోకొచ్చి అడిగారు "ఏమే శశీ! పిల్లాడికి తగ్గినట్టు లేదు. రేపు మరొక డాక్టర్ని మార్చాలేమో."

"లేదు జ్వరం కొంచెం ఎక్కువగావుంది. రేపటికి తగ్గిపోవచ్చు" అని అంది. ఆ మాట ఎంత బాధగానూ గొంతుక బిగపట్టి అందో గ్రహించారు.

"నీ తోడికోడలు వరుస ఏమీ బాగులేదు శశీ! అంతా చూస్తూనే వున్నాను. కళ్ళెం విడిలిన గుఱ్ఱంలాగున దాని నిష్టమొచ్చిన విధంగా వుంది."

"మీరా మాట అనకండి, మీ పాదాలకి నమస్కరిస్తాను. అక్కయ్య, అత్తగారు లేరనే బాధ కొద్దీ వివేకజ్ఞానం లేకపోయిందనుకుంటాను. మరింటి వాళ్ళనే ఖేదపరుస్తే నేను సహించలేను."

"నీ ఔదార్యంలో సగం దాని కుంటే యీ విధంగా జరగకపోను." అని వెళ్ళిపోయారు. రాత్రి భార్యాభర్తకి మధ్య పెద్దతగవులాటజరిగింది.

తెల్లవారి పెద్దావిడ చెంపమీద చెయ్యిపెట్టుకుని ఏడుస్తూ అరిచింది.

'శశీ!...వెనకనించి నువ్వు ఆడే నాటకం గమనిస్తూనే వున్నాను. బావగార్ని కూడా వశపర్చుకుని మా నెత్తిన మేకై కూర్చున్నావు..."

"నువ్వు అట్టే మాట్లాడకు లక్ష్మీ...ముందు మీ అమ్మ, నువ్వు ఆడే నాటకాలలాంటివి కాదు. నోరెత్తటానికి వీలులేదు...పద లోపలికి..." అని గంభీరంగా అనేసరికి యింట్లో అందరూ బేజారై పోయారు.

ఓహ్ భగవానుడా!... యీ యిల్లు ఎంత శోభాయమానంగా వెల్గుతూండేదో యిప్పుడెలాగున మారిందో నువ్వే గుణించి చెప్పాలి. కేశవుడు ఒంటరిగా కూర్చుని ఏమి ఆలోచించుకున్నాడో ఏమో ఎదురింట్లోకి వెళ్ళి స్థిమితంగా కూర్చుండిపోయాడు. ప్రమీల అల్లికగుడ్డ పక్కన పెట్టి కేశవుడికేసి చూసి నవ్వుతూ అంది "మీ రివాళ చాలా శాంతంగా వున్నట్టు కనిపిస్తున్నారే..."

"మగవాళ్ళ మనసు ఆందోళితమయిన కొద్దీ శాంతపడిపోతారు...యిదే ఆడవాళ్ళలో అయితే తోకతొక్కిన కోతిలాగున నాట్యం చేస్తారు..."

"అయితే మీ చిన్నఒదినగారుకూడా అలాగే నంటారా?..."

"మా పెద్ద ఒదిన వుదాహరణగా చెప్పాలి. ఆవిడలాంటివాళ్లు అలావుండగల్గటం ఏమంత ఆశ్చర్యకరమైనది కాదు...నీకు యీ సంగతులు ఎలా తెలిశాయి ప్రమీల?..."

"కావలిస్తే నన్నిక్కడ నుంచోబెట్టి ఏ యింటివార్లనయినా అడిగిరండి. అంతా చెప్తారు మీ ఎదురుగా..."

"నా జీవితంలో యిదొక పెద్దమార్పు తెచ్చింది ప్రమీల...యింకొక విషయం అడగాలని ఎన్నో రోజుల్నించో ఆలోచించి వూరుకున్నాను..."

"మీరడగబోయేది అంత పెద్ద విషయమన్నమాట!" అని నవ్వింది.

"నవ్వులాట కాదు ప్రమీల...నీకు నన్ను చేసుకోవటంలో ఏమైనా ఆటంకముందా?" యీ ప్రశ్న అతని నోటివెంట వచ్చి తీరుతుందని గ్రహించినా ఆ మార్పును దాచింది.

"అలా అయితే కొంచెం ఆలోచించాల్సివుంది. మీరు అన్నవరం వెడదామన్నారు!...అన్నయ్య కెమెరాలో ఫిల్మ్ నింపుకుని వచ్చాడు. మీరు సిద్ధపడితే రేపే వెళ్దాం..." అంది.

• • •

"నేను చాలా సిగ్గుపడి పోతున్నా చిన్న ఒదినా! నీలో వుండే ఓరిమిచూసి మరీ లోకువ కడుతున్నారు. అమ్మ వుండేప్పుడు అంతా బాగానే వుంది. నిజంగా ఆవిడ యింటిని, కోడళ్ళని చూసి గర్వపడేది..."

"నువ్వు వూరిప్రయాణంమీదున్నట్టున్నావు!"

"ఎవరు చెప్పారు ఒదినా నాకన్నా ముందర నేనా విషయం చెప్పాలనే వచ్చాను."

"నువ్వు ఏమనుకునేది నీకన్నా ముందు ప్రమీల వచ్చి చెప్తూంటుంది నాకు...నువ్వు జ్ఞానం కలవాడివి. ఏది చెయ్యాలన్నా ఆలోచించి చేస్తావనే నమ్ముతాను."

"నిజం ఒదినా...యిన్నాళ్ళు నేను నాగురించి ఏమాత్రం ఆలోచించుకోలేదు. యివాళ నిలబడితే మటుకు స్వార్థపరుడిగానే బతకగలనని అనుకుంటున్నాను. ఇప్పుడు పూర్తిగా నా మంచి చెడ్డలు నామీదే పడ్డాయి."

"అయితే మేమంతా మట్టి కొట్టుకుపోయామంటావా ఏం? అటువంటి మాట నీ నోటిమీదుగా నేను వినలేను" అని తల దించుకుంది.

రాత్రి చిన్నాయన అన్నగారి గదిలో కెళ్ళి సంభాషించాడు "అన్నయ్యా! యిల్లు యీ పరిస్థితిలో వుండగా కలిసివుండటం కుదరదనుకుంటాను."

"నువ్వు శాంతం గలవాడి వనుకున్నాను. నువ్వు యిలాగు మాట్లాడితే ఎలాగ?"

"ఇలాటి పరిస్థితిలో ఎవరూ ఏమీ చేయలేరు."

"అయితే నువ్వు వేరైపోతావా? యిదంతా నా అత్తగారు తల్చుకుని చేసిన పనిలాగ వుంది" అన్నాడు బాధగా.

మర్నాడు చిన్నావిడ పనికట్టుకుని గౌరీపతిగారింటికి వెళ్ళింది. వేసిన లెక్కప్రకారం ఎదురిల్లు కేశవుడికీ, చిన్నాయనకీ వచ్చింది.

"మీరు ఖాళీచేసి రేపటికి మేడభాగం కింద సగం మాకు యిచ్చివేయాలి. మిమ్మల్ని శ్రమ పెట్టినందుకు క్షమించండి" యీ మాట విని కేశవుడు ప్రమీల విస్మితులయారు. సావిత్రమ్మగారు ఏ విధంగానూ మాట్లాడలేకపోయింది.

* * *

మర్నాడు పెద్దావిడ తోడికోడలు ఏం సామాను తీసికెడుతోన్నదీ చూస్తోనుంచుంది.

"శశీ! ఆ నిలువుటద్దంలో నల్గురూ భాగస్థులమని గ్రహించు. దాని డబ్బు తక్కిన ముగ్గురికీ పంచిగాని తీసికెళ్ళడానికి వీలులేదు."

"అద్దంలాటి మనసులే విరిగిపోతే యింక యీ అద్దం దేన్ని రక్షిస్తుంది అక్కయ్యా!" అని అద్దాన్ని అక్కడేవుంచి వెళ్ళిపోయింది. పెద్దాయన తల్లిఫొటో ఒకసారి చూశారు. ఆమె మొహంలో కొంత కాంతి విహీనత కన్పించింది. గుండె బాధతో తరుక్కుపోయింది.

(సమాప్తము) ★

---

ప్రమాద పంచాంగం

# ఇండియాలో రైల్వే ప్రమాదాలు

గత ఒకటిన్నర సంవత్సరంలో ఎనిమిదిమార్లు రైల్వే ప్రమాదాలు జరిగాయి. ఆ కారణంగా, నలభైమంది చనిపోయారు; వందమందిదాకా గాయపడ్డారు.

1954-55 సంIIలో రైల్వేశాఖకు చెందిన ఇన్‌స్పెక్టర్లు ఇండియా ప్రభుత్వపు రవాణాశాఖ తరఫున విచారణలు జరిపి, పదహారు తీవ్రమైన ప్రమాదాలు రైల్వేశాఖకు సంబంధించినవి, జరిగినవని నిర్ధారించారు.

1953-54 సంIIలో ఇరవైదాకా ప్రమాదాలు జరిగినట్టు తేలింది.

1954-55 సంIIలో జరిగిన పదహారు ప్రమాదాల్లో ఎనిమిది, పట్టాలు తప్పి రైలుబళ్ళు పడిపోయిన కారణంగానూ, ఐదు రైలుబళ్ళు తమలో తము గ్రుద్దుకొన్న కారణంగానూ, మిగతా మూడింట్లో, ఒకటి అగ్నిప్రమాదానికి గురైన కారణంగానూ, తలిమా రెండూ లెవిల్ క్రాసింగ్‌వద్ద రైళ్ళు, వేరే బళ్ళు గ్రుద్దుకోవడంవల్లనూ జరిగాయి.

పై జరిగిన ఐదు రైళ్ళుబళ్ళు గ్రుద్దుకున్న ప్రమాదాలలో నాలుగు పనివారి అశ్రద్ధ కారణంగా జరిగాయి. పట్టాలు తప్పిన ఎనిమిదింట్లో, రెండు పనివారి అశ్రద్ధ కారణంగానూ, మూడు ఇంజన్ పొరపాటువల్లనూ, రెండు పట్టాలు పాడైన కారణంగానూ జరిగాయి.

మొత్తం చిన్నా పెద్దా అన్నీ కలుపుకొని 1954-'55 సంవత్సరంలో 12,922 రైల్వే ప్రమాదాలు జరిగాయి. అంతకుముందు సంII అనగా 1953-54 సంIIలో 15,517 ప్రమాదాలు జరిగాయి.